సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం । 27 । నవంబర్ । 2024



పుణ్యక్షేత్ర పవిత్రతను కాపాడుకోవాలి

అంతర్వేది పుణ్యక్షేత్ర పవిత్రతను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి భక్తులకు హితవు పలికారు.


8 లో



ధాన్యం ఇలా భద్రపరుచుకోవాలి

ఖరీఫ్ మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ తరుణంలో ధాన్యాన్ని ఎలా భద్రపరచుకోవాలో రైతులకు కాకినాడ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సూచనలు చేశారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు, మధ్య డెల్టాలకు చెరో 600, పశ్చిమ డెల్టాకు 2,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి జలాలను విడుదల చేశారు. సముద్రంలోకి 17,382 క్యూసెక్కుల మిగులు జలాలను విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

మండల వ్యవసాయ అధికారి సస్పెన్షన్



సూర్య రమేష్

సీతానగరం: మండల వ్యవసాయ అధికారి కె.సూర్య రమేష్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలకు చెందిన రైతులు ఖరీఫ్ ధాన్యాన్ని స్థానికంగా ఉన్న మిల్లులకు మాత్రమే పంపుకోవాలని కలెక్టర్ ప్రశాంతి చెప్పినట్లుగా మండల వ్యవసాయాధికారి పేరిట సోషల్ మీడియాలో ఓ ప్రకటన వైరల్ అవుతోంది. అయితే, ఆవిధంగా కలెక్టర్ ఎటువంటి ప్రకటనా చేయలేదు. తాను అధికారికంగా చెప్పని విషయాన్ని చెప్పినట్లు సూర్య రమేష్ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసినట్లు సమాచారం అందిందని, ఈ మేరకు ఆయనను సస్పెండ్ చేశామని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఎటువంటి కథనాలూ ప్రచారం చేయరాదని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు మాత్రమే నడుచుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

రాజ్యాంగంతో స్వేచ్ఛ, సమానత్వం



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ, పోలీసు అధికారులు

కంబాలచెరువు రాజమహేంద్రవరం): దేశ ప్రజలందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను అందించిన ఘనత భారత రాజ్యాంగానికే దక్కుతుందని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఎస్పీ, అధికారులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు అల్లూరి వెంకట సుబ్బరాజు(శాంతిభద్రతలు), ఎన్‌బీఎం మురళీకృష్ణ(అడ్మిన్) తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో నూరు శాతం ఫలితాలు సాధించాలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలోని ఇంటర్మీడియెట్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఇంటర్మీడియెట్ త్రైమాసిక పరీక్షా ఫలితాలపై జిల్లాలోని 18 జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా అధ్యాపకులు నిబద్ధతతో పని చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, కేటగిరీల వారీగా విభజించి, వారికి అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించి, చదివించాలని సూచించారు. రాబోయే అర్ధ సంవత్సరం పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత నూరు శాతం ఉండేలా కృషి చేయాలన్నారు. విద్యార్థులు ప్రతి రోజూ కళాశాలకు వచ్చేలా వారి తల్లిదండ్రులతో మాట్లాడాలని చెప్పారు. సమావేశంలో జిల్లా ఒకేషనల్ విద్య అధికారి జేవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఆర్ఐఓ ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు : డీఎంహెచ్‌ఓ



రాజమహేంద్రవరం రూరల్: అనుమతులు లేకుండా ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) వెంకటేశ్వరావు హెచ్చరించారు. ప్రసూతి సేవలు అందిస్తున్న ప్రైవేటు ఆసుపత్రులపై మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లపై ఆకస్మిక తనిఖీలు చేస్తామని చెప్పారు. ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లకు అగ్నిమాపక శాఖ అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. క్లినిక్‌లు, ల్యాబ్‌లు, డయోగ్నస్టిక్ సెంటర్లు, ఫిజియోథెరపీ క్లినిక్‌లు, ప్రైవేటు ఆసుపత్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, సంబంధిత డాక్యుమెంట్లు జత పరచాలని సూచించారు. ప్రతి ఆసుపత్రి, డయోగ్నస్టిక్ సెంటర్లలో ఏ పరీక్షలకు ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ధరల పట్టిక ప్రదర్శించాలని స్పష్టం చేశారు. అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో జననాలు, మరణాలు, నిశ్చల జననాలను సకాలంలో నమోదు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ గణాంక అధికారి కుమారస్వామి చెప్పారు.



కలెక్టరేట్ వద్ద ఇటీవల ధర్నాచేస్తున్న ఆశా కార్యకర్తలు

కదనపథం

- ఎన్నికల్లో అలవి కాని హామీలు
- గద్దెనెక్కాక విస్మరణ
- కూటమి ప్రభుత్వంపై వివిధ వర్గాల ఆగ్రహం
- కలెక్టరేట్, ఇతర ప్రాంతాల్లో నిత్యం ఆందోళనలు
- హామీలు నెరవేర్చాలని చిరుద్యోగుల డిమాండ్
- పట్టించుకోని సర్కార్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అధికార పగ్గాలు చేపట్టేందుకు అలవి కాని హామీలు ఇచ్చారు. సూపర్–6తో పాటు అనేక వాగ్దానాలు చేసి, జనాన్ని నమ్మించారు. ఎట్టకేలకు గద్దెనెక్కారు. అంతే.. ఆర్థిక పరిస్థితి బాగోలేదని, కొండంత అప్పులున్నాయని సాకులు చెబుతూ.. హామీలు నెరవేర్చడం సాధ్యం కాదని నాలుక మడత పెడుతున్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా హామీల అమలు ఊసే తేవడం లేదు. దీంతో, ఎన్నికల ఏరు దాటేందుకే కూటమి నేతలు రకరకాల మాటలు చెప్పి, తమను మభ్యపెట్టారని అన్ని వర్గాల ప్రజలూ నమ్ముతున్నారు. కూటమి ప్రభుత్వంపై వారి భ్రమలు ఒక్కొక్కటిగా తొలగిపోతున్నాయి. ఫలితంగా వారు ఆందోళన బాట పడుతున్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, వివిధ ప్రభుత్వ శాఖల్లోని చిరుద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు, మహిళలు.. ఇలా అన్ని వర్గాల వారూ ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద నిత్యం ధర్నాలు, నిరశన దీక్షలు చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆయా వర్గాల ప్రజలు కూడా రోడ్డెక్కడం షరా మామూలుగా మారింది. తమ వినతులు కలెక్టర్, ఆయా అధికారుల ద్వారా ప్రభుత్వానికి చేరుతాయని, సమస్యలు పరిష్కారమవుతాయని ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ ప్రభుత్వం కనీసంగా కూడా తమ గోడు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇంకా..

గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఆరు నెలల వ్యవధిలోనే 90 శాతం వరకూ అమలు చేయగా.. నేడు కూటమి ప్రభుత్వ తీరు దీనికి భిన్నంగా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలన్నింటినీ కూటమి ప్రభుత్వం ఆపేయడంపై అన్ని వర్గాల్లోనూ తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. నాడు 'బాదుడే బాదుడు' అంటూ ఊరూవాడా తప్పుడు ప్రచారం చేసిన కూటమి నేతలు.. నేడు కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయినా చర్యలు తీసుకోవడం లేదని మహిళలు మండిపడుతున్నారు. అలాగే, గుడి, బడికి చేరువలోను, మహిళలకు ఇబ్బంది కలిగే రీతిలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంపై పలుచోట్ల ప్రజలు ఆందోళనలు నిర్వహించారు. ఇంకా కరెంట్ బిల్లులు షాక్ కొడుతున్నాయని వినియోగదారులు.. తమ సేవలను కొనసాగించాలని వలంటీర్లు.. రైతుభరోసా నిలిపివేయడం, ఉచిత పంటల బీమాను ఎత్తివేయడంపై రైతులు.. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో విడుదల చేయకపోవడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు.. ఇచ్చిన హామీ ప్రకారం భృతి చెల్లించడం లేదని నిరుద్యోగులు.. ఇలా అన్ని వర్గాల్లోనూ కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.



ఆనం కళాకేంద్రం వద్ద ఈ నెల 20న కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన

కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల ఆవేదన

అందరి ఆరోగ్యం కోసం అనునిత్యం శ్రమిస్తూ.. వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగులుగా పని చేస్తున్న ఆరోగ్య సహాయకులు సైతం తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన బాట పట్టారు. అర్ధాకలితో అలమటిస్తున్న తమకు గత ప్రభుత్వంలో మాదిరిగా నూరు శాతం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులు ఈ నెల 20న రాజమహేంద్రవరంలో ఖాళీ ప్లేట్లతో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ప్రస్తుతం 60 ఏళ్లకే రిటైర్ చేస్తూండటంతో ఎటువంటి ఆర్థిక భరోసా లేకుండా ఇళ్లకు వెళ్లాల్సి వస్తోందని, తమకు కూడా రిటైర్మెంట్ వయో పరిమితిని 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. తమ బతుకులకు భద్రత, భరోసా లేకపోయినా.. కనీసం ఉన్నంతలో సంతృప్తికరంగా నూరు శాతం వేతనం చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. సంబంధిత జీఓ అమలు కోసం అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టు ఆరోగ్య సహాయకులు చలో అమరావతి నిర్వహించాలని యోచిస్తున్నారు.

ఆశా వర్కర్ల ఆశలపై నీళ్లు

క్షేత్ర స్థాయిలో ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్ల ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు జల్లింది. దీనిని నిరసిస్తూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఈ నెల 18న కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మినిట్స్ కాపీ ప్రకారం జీఓలు, సర్క్యులర్లు వెంటనే విడుదల చేయాలని, ఇటీవల రిటైరైన వర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్లు రూ.60 వేలు ఇవ్వాలని, ఇటీవల మరణించిన ఆశా వర్కర్లకు మట్టి ఖర్చుల కింద రూ.20 వేలు అందించాలని, బీమా సౌకర్యం కల్పించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, జీతంతో కూడిన మెటర్నిటీ లీవ్ సౌకర్యం కల్పించాలని, ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రిటైరైన వారిని యథావిధిగా విధుల్లోకి తీసుకోవాలని, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరుతో తాము నానాటికీ తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం ఇంత వరకూ స్పందించలేదు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



ఉచిత ఇసుక ఇస్తామని భవన నిర్మాణ రంగానికి ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆశలు చూపించారు. కానీ మమ్మల్ని పూర్తిగా ముంచేశారు. ఉచిత ఇసుక పేరుకే తప్ప ఆచరణలో అమలు కావడం లేదు. ఇతర ప్రాంతాల నుంచి పెద్ద పెద్ద లారీలు తీసుకుని వచ్చి, ఇక్కడి ఇసుకను తరలించుకు పోతున్నారు.

– వందేళ్ల భానుప్రసాద్, భవన నిర్మాణ సంఘం యూనియన్ జిల్లా అధ్యక్షుడు

జీఓలు రాక ఆశా వర్కర్లకు నష్టం



ప్రభుత్వం ఇచ్చిన హామీల మినిట్స్ ప్రకారం జీఓలు విడుదల చేయకపోవడంతో కింది స్థాయిలో పని చేస్తున్న ఆశా వర్కర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవలి కాలంలో రిటైరైన వర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.60 వేలు అందడం లేదు. 60 సంవత్సరాలు నిండిన వారు రెండేళ్ల వయోపరిమితి పెంపుదలకు అనర్హులుగా మిగిలిపోయారు. ఇటీవల మరణించిన ఆశా వర్కర్లకు మట్టి ఖర్చులుగా రూ.20 వేలు అందించాలి

– ఎం.వెంకటలక్ష్మి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అంగన్‌వాడీల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

పేద గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అంగన్‌వాడీ కార్యకర్తలు అనేక సేవలు అందిస్తున్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్కర్ పని, హెల్పర్ పని ఒక్కరే చేయాల్సి రావడంతో వీరికి పనిభారం ఎక్కువవుతోంది. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ మినీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ తక్షణం జీఓ ఇవ్వాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఈ నెల 16న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలనే జీఓ ఉన్నా సక్రమంగా అమలు కావడం లేదని ఆవేదన చెందారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్లతో 42 రోజుల పాటు అంగన్‌వాడీ వర్కర్లు గతంలో సమ్మె చేశారు. ఆ సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

104 సిబ్బంది నిరసన స్వరం



కలెక్టరేట్ వద్ద ఇటీవల 104 సిబ్బంది ధర్నా

వైద్య సౌకర్యాలకు దూరమైన గ్రామీణులకు 104 సిబ్బంది అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి. అటువంటి సేవా సైన్యం కూడా తమ సమస్యలు పరిష్కరించాలంటూ రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడింది. గతంలో మాదిరిగా 104 సేవలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రభుత్వమే నిర్వహించాలని, వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించి, జీఓ నంబర్–7 ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ 104 సిబ్బంది ఆందోళనలు నిర్వహిస్తున్నారు.

నిర్మాణ కార్మికుల కళ్లల్లో ఇసుక



కలెక్టరేట్ వద్ద ఈ నెల 11న ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

నిర్మాణ రంగంలో ప్రధానమైన ముడి సరుకు ఇసుక. కూటమి ప్రభుత్వ హయాంలో అది అందుబాటులో లేకపోవడంతో ఎక్కడి నిర్మాణాలు అక్కడే నిలిచిపోయాయి. ఫలితంగా లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలులోకి తీసుకుని వచ్చింది. ఈ నూతన విధానం అధికార పార్టీ నేతలకు, దళారులకే ఉపయోగపడుతోందని, అవసరమైన వారికి ఇసుక ఉచితంగా దొరకడం లేదని, దీనివలన సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అందరికీ ఇసుక లభ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన రాజమహేంద్రవరం కలెక్టరేట్ వద్ద భవన నిర్మాణ కార్మికులు ఈ నెల 11న ధర్నా నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుక అన్నారని, కానీ, ఎక్కడా ఉచితంగా దొరకడం లేదని, డబ్బులు తీసుకొనైనా ఇసుక అందుబాటులోకి తీసుకుని రావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమ్మాయిలపై అఘాయిత్యాలు జరిగితే తానే హోం శాఖ తీసుకోవలసి వస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఊగిపోతూ చెప్పారని, అటువంటి వ్యక్తి రాష్ట్రంలో ఇసుక దొరకక 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు పస్తులుంటూంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సొంతూళ్లో పనుల్లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దుస్థితిని కూటమి ప్రభుత్వం తీసుకుని వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న భక్తజనప్రవాహం



రత్నగిరిపై విశ్రాంతి షెడ్డులో సేద తీరుతున్న భక్తులు

- సత్యదేవుని దర్శించిన 60 వేల మంది
- 6 వేల వ్రతాల నిర్వహణ
- రూ.60 లక్షల ఆదాయం

అన్నవరం: రత్నగిరిపై భక్తజనప్రవాహం కొనసాగుతూనే ఉంది. సోమ, మంగళవారాల్లో సుమారు 2 లక్షల మంది సత్యదేవుని దర్శించిన విషయం తెలిసిందే. ఈ ఒరవడి మంగళవారం కూడా కొనసాగింది. కార్తిక బహుళ ఏకాదశి పర్వదినం కావడంతో సత్యదేవుని సన్నిధికి భక్తులు భారీగా తరలి వచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. తెల్లవారుజాము నుంచి సాయంత్రం 4 గంటల వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 60 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారు. స్వామివారి వ్రతాలు 6 వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.60 లక్షల ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్ర మోహన్ పర్యవేక్షించారు.

గత కార్తికం కంటే మిన్నగా..

సత్యదేవుని సన్నిధిలో గత ఏడాది కార్తిక మాసంలో 1.25 లక్షల వ్రతాలు జరిగాయి. ప్రస్తుత కార్తికంలో మంగళవారం నాటికే ఈ రికార్డును అధిగమించి ఏకంగా 1,28,496 వ్రతాలు నిర్వహించారు. గత ఏడాది కార్తికంతో పోలిస్తే ఈసారి ఇప్పటికే సుమారు 3,500 వ్రతాలు అధికంగా జరిగాయి. కార్తిక మాసంలో మిగిలిన ఐదు రోజుల్లో మరో 20 వేల వ్రతాలు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు

కార్తిక బహుళ ఏకాదశిని పురస్కరించుకుని సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు స్వర్ణపుష్పాలతో అష్టోత్తర పూజ చేశారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ సహస్రార్చన నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రసాదాలు నివేదించి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు సుధీర్, దత్తాత్రేయశర్మ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం, గిట్టుబాటు ధరలకు చట్టం చేయాలి



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు

రాజమహేంద్రవరం సిటీ: కనీస వేతనాలు, గిట్టుబాటు ధరలకు చట్టం చేయాలని, మోదీ నిరంకుశ పాలన నశించాలని కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యాన నగరంలో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. దేశవ్యాప్తంగా 10 కేంద్ర కార్మిక సంఘాలు, 500 రైతు సంఘాలు సంయుక్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా స్థానిక కోటిపల్లి బస్టాండ్ నుంచి కోటగుమ్మం వరకూ ఈ భారీ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పంటల పెట్టుబడిపై 50 శాతం అదనంగా నిర్ణయించి రైతులకు గిట్టుబాటు ధర చెల్లించేలా చట్టం చేయాలని, ఏ రంగంలోని కార్మికుడికైనా జాతీయ కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, 60 ఏళ్లు పని చేసి, రిటైరైన వారికి కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలని, ఆటో, హమాలీ, రవాణా, భవన నిర్మాణ రంగాల కార్మికులకు సామాజిక భద్రత కల్పించే చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లయిన అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్షతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, గ్రాట్యుటీ, పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్లు కల్పించాలని, అప్పటి వరకూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, రైల్వే తదితర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను తక్షణం నిలుపు చేయాలన్నారు. ప్రజలపై విద్యుత్ భారాలు పెంచే 2023 విద్యుత్ చట్టాన్ని రద్దు చేయాలని, అత్యవసర మందులపై జీఎస్‌టీ ఎత్తివేయాలని, ధరలు తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్‌ను జీఎస్‌టీ పరిధిలోకి తీసుకురావాలని, అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని. స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణం నిలుపు చేయాలని, పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు నిత్యం భద్రతా ఆడిట్లు నిర్వహించాలని, మూసివేసిన పరిశ్రమలను తెరిపించి, కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, ఎస్ఎస్ మూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి కె.రామకృష్ణ, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కొండలరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.జోజి, తాటిపాక మధు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం విశిష్టత ప్రతి ఒక్కరికీ తెలియాలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): భారత రాజ్యాంగం విశిష్టత ప్రతి ఒక్కరికీ తెలియాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజ్యాంగ ఆమోదం పొంది 75 సంవత్సరాలైన సందర్భంగా కలెక్టరేట్‌లో మంగళవారం వేడుకలు నిర్వహించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటాలకు కలెక్టర్ పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం గొప్పతనాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేయాలనే లక్ష్యంతో ఏటా నవంబర్ 26న వేడుకలు నిర్వహించుకుంటున్నామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి మాట్లాడుతూ, ప్రపంచంలోని వివిధ దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి, మంచిని గ్రహించి, మన రాజ్యాంగాన్ని అత్యున్నతంగా రూపొందించారని చెప్పారు. ఈ సందర్భంగా సభికులతో ప్రతిజ్ఞ చేయించారు. వ్యాసరచన, డ్రాయింగ్, ఉపన్యాసం, క్విజ్, చర్చా కార్యక్రమం, రన్నింగ్, గేయాలపనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.



మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

క్లుప్తంగా

సపక్ తక్రా పోటీల్లో ఇద్దరికి కాంస్య పతకాలు


విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: విజయవాడలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 సపక్ తక్రా క్రీడా పోటీల్లో స్థానిక కొంకాపల్లి జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అప్పారి పవన్, పేరూరి రోహిత్ సాయి ఫణీంద్రలు కాంస్య పతకాలు సాధించారు. వీరు ఉమ్మడి తూర్పు గోదావరి తరఫున సపక్ తక్రా క్రీడలో సత్తా చాటి రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ తెలిపారు. పతకాలు, షీల్డ్‌లను ఇద్దరి విద్యార్థులు విజయవాడలో ఆదివారం రాత్రి అందుకున్నారని చెప్పారు. ఈ ఇద్దరిని డీఈవో డాక్టర్ ఎస్‌కే సలీమ్ బాషా, డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, స్థానిక కౌన్సిలర్ తిక్కా సత్య లక్ష్మి, స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ వానపల్లి ముక్కోటి రాంబాబు అభినందించారు.

గోగన్నమఠం వాసికి ముంబయి జట్టులో చోటు


సత్యనారాయణరాజు

మామిడికుదురు: ముంబయి ఇండియన్స్ జట్టులో స్థానం పొందిన ఫాస్ట్ బౌలర్ పీవీ సత్యనారాయణరాజు గోగన్నమఠం గ్రామానికి చెందినవాడు. అతను ఇక్కడే పుట్టాడు. ప్రాథమిక విద్యాభ్యాసం అంతా ఇక్కడే జరిగింది. ఐపీఎల్ మెగా వేలంలో మేటి జట్టు అయిన ముంబయి ఇండియన్స్ రూ.30 లక్షలకు ఇతన్ని దక్కించుకుంది. ముంబయి ఇండియన్స్ జట్టుకు సత్యనారాయణరాజు ఎంపిక కావడంతో అతని స్వస్థలం గోగన్నమఠంలో మంగళవారం స్నేహితులు, బంధువులు సంబరాలు చేసుకున్నారు. మా వాడికి ముంబయి జట్టులో చోటు దక్కిందంటూ ఆనందం పంచుకున్నారు. సత్యనారాయణరాజు తండ్రి రమేష్ రాజు కొన్నేళ్ల క్రితం కాకినాడ వెళ్లి అక్కడ స్థిర పడ్డారు. ఆయనకు ఇద్దరు కొడుకులు కాగా పెద్ద కొడుకు సత్యనారాయణరాజు ఫాస్ట్ బౌలర్‌గాను, చిన్న కొడుకు పాండురంగారావు బ్యాట్స్‌మెన్‌గాను క్రికెట్‌లో రాణిస్తున్నారు. ఇప్పుడు పెద్ద కొడుకు ఐపీఎల్‌కు ఎంపిక కావడం స్థానికులను ఆనందంలో ముంచెత్తింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మలికిపురం: మండలంలోని శంకరగుప్తం గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేశనపల్లి గ్రామానికి చెందిన కల్వకొలను వెంకటలక్ష్మి(55) అనే మహిళ మృతి చెందినట్టు ఎస్సై పి.వి.వి.ఎస్.సురేష్ తెలిపారు. భర్త ఏసుబాబుతో కలిసి అంతర్వేది పుణ్య స్నానాలకు వెళ్లిన వెంకట లక్ష్మి మోటార్ సైకిల్‌పై తిరిగి కేశనపల్లి వెళ్తుండగా శంకరగుప్తంలో ముందు వెళ్తున్న మోటార్ బైక్ సిగ్నల్ ఇవ్వకుండా హఠాత్తుగా టర్న్ తీసుకోవడంతో ఈ ప్రమాదం సంభవించింది. తీవ్రంగా గాయపడిన వెంకటలక్ష్మిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసినట్టు ఆయన వివరించారు.

ధాన్యం ఇలా భద్రపరచుకోవాలి..


తేమ శాతం తగ్గించేందుకు ఆరబెట్టిన ధాన్యం



కాకినాడ సిటీ: ఖరీఫ్ మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇంటికి వచ్చిన ధాన్యాన్ని ఎలా భద్రపరుచుకోవాలో తెలియక రైతులు తికమకపడుతుంటారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని భద్రపరుచుకోవడం రైతులకు సవాల్ లాంటిది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పండించిన పంటలో 10 నుంచి 20 శాతం నష్టపోయే ప్రమాదం ఉందంటున్నారు వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎస్.విజయకుమార్. ధాన్యం నిల్వ చేసుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన రైతులకు వివరించారు. ధాన్యం నూర్చిన తరువాత ఇంటి అవసరాలు, విత్తనాలకు కలిపి సుమారు ఏడాదికి పైగా భద్రపరచాల్సి ఉంటుంది. దీంతో ధాన్యం రంగు, రుచి తగ్గుతుంది. సాధారణంగా వరి కోతల సమయంలో ధాన్యం 20 శాతం తేమ ఉంటుంది. కోసిన తరువాత వరి పనలను ఆరబెట్టడం వల్ల 4 నుంచి 6 శాతం తేమ తగ్గవచ్చు. ధాన్యంలో 14 శాతానికి మించి తేమ ఉంటే బూజు పట్టే అవకాశాలు ఉంటాయి. నిల్వ చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే కీటకాలు ఆశించి నష్టం కలుగుజేస్తాయి. అంతేకాక ఎలుకలు ధాన్యాన్ని తినడమే కాక, వాటి విసర్జనలతో కలుషితమయ్యే ప్రమాదం ఉంది. నిల్వ ఉంచిన ధాన్యాన్ని నష్టపరిచే కీటకాల బెడద కూడా ఎక్కువే..

ముక్క పురుగు

పంట కోయడానికి ముందు నుంచే ముక్క పురుగు నష్టం కలిగిస్తుంది. బియ్యంలో తెల్లని పురుగులుగా కనిపిస్తుంది. బియ్యంలో తెల్లని పురుగులుగా కనిపించేవి లార్వా దశలో ఉన్న ఈ పురుగులే. తల్లి కీటకం వడ్ల గింజకు చిన్న రంధ్రం చేసి అందులో గుడ్లు పెట్టి తన నోటి నుంచి వెలువడే కొవ్వు పదార్థంతో రంధ్రాన్ని మూసి వేస్తుంది. ప్రౌఢ దశలోని ముక్క పురుగు గింజ లోపల బియ్యం తింటూ నష్టం కలిగిస్తుంది.


ఎస్.విజయకుమార్, జిల్లా వ్యవసాయాధికారి, కాకినాడ

వడ్ల చిలుక

ధాన్యానికి వడ్ల చిలుక ఆశిస్తే ధాన్యం చెడు వాసన వస్తుంది. తల్లి కీటకాలు వడ్ల గింజలపై గుంపులుగా చేరి గుడ్లు పెడతాయి. గుడ్లు పగిలి లార్వా గింజ లోపలికి తొలుచుకుని పోయి బియ్యపు గింజను తింటుంది. అనంతరం ప్యూపా దశ చేరక ముందే పై పొట్టులో చిన్న రంధ్రం చేస్తుంది. ప్రౌఢ దశకు చేరిన తరువాత ఆ రంధ్రం ద్వారా వడ్ల చిలుక బయటికి వస్తుంది. ఇది వడ్ల మూటలు, గిడ్డంగులలో కనిపిస్తుంది.

నుసి పురుగు

దీనినే పుచ్చు పురుగు లేదా పెంకు పురుగు అంటారు. ఇది గొట్టపు ఆకారంలో చాలా చిన్నదిగా 3 మిల్లీమీటర్ల పొడవు ఉంటుంది. ధాన్యం గింజలకు నష్టం కలిగిస్తుంది. ఇది ప్రారంభ దశల్లో చెత్తను, ఆ తరువాత గింజపై పొరను, ఆ తర్వాత లోపలి బియ్యపు గింజను తిని తీవ్ర నష్టం కలిగిస్తుంది.

ఎలుకల నివారణకు చర్యలు

ధాన్యం గిడ్డంగి చుట్టూ చెత్త లేకుండా రోజూ శుభ్రం చేస్తుండాలి. వివిధ రకాలైన బోనులు, బుట్టలను ఉపయోగించి ఎలుకలను నిర్మూలించాలి. గిడ్డంగి తలుపుల కింద భాగాలకు జింక్ రేకులు అమర్చాలి. రంధ్రాలకు వైర్‌మెష్ మూతలు అమర్చాలి.

ధాన్యం నిల్వ చేసే పద్ధతి

రైతుల తక్కువ ధాన్యం నిల్వ చేసుకోవాలంటే వెదురు, సిమెంటు, లోహపు గాదెలను వినియోగించుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలనుకుంటే గోదాంలు లేదా గిడ్డంగులను సిమెంటు కాంక్రీటుతో నిర్మించుకుంటే పూర్తి రక్షణ ఉంటుంది. ముఖ్యంగా కీటకాలు, తేమ, వర్షపు నీరు లోనికి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలుక కన్నాలు ఉంటే గాజు ముక్కలు, సిమెంటుతో పూడ్చి వేయాలి. ధాన్యం నిల్వకు కొత్త గోనె సంచులు ఉపయోగించాలి. గోనె సంచులపై, లోపలి మలాథియాన్ లేదా ఎండోసల్ఫాన్ ద్రావణం స్ప్రే చేయాలి. తర్వాత రోజు సంచులను ఎండలో ఆరబెట్టాలి.

అనర్హులకు ఎందుకు ఉద్యోగాలు ఇచ్చినట్టు?

జీజీహెచ్ మేనేజర్‌కు కలెక్టర్ మెమో

కాకినాడ క్రైం: అనర్హులకు ఎందుకు ఉద్యోగాలు ఇచ్చినట్లు..? అర్హుల భవితను ఎందుకు చిదిమేశారు..? నాన్ లోకల్ వారికి ఎందుకు ప్రయోజనం చేకూర్చారు...? పెన్సిల్ రాతలతో ఎందుకు రికార్డులు మార్చేశారు...? రోస్టర్ ఎందుకు అవలంబించలేదు..? ఇవీ... కలెక్టర్ షన్మోహన్ నర్సింగ్ పోస్టుల విక్రయాలకు పాల్పడిన జీజీహెచ్ మేనేజర్ నరసింగరావుపై సంధించిన ప్రశ్నలు. నర్సింగ్ పోస్టుల విక్రయాల బాగోతంపై కలెక్టర్, డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీ చైర్మన్ షన్మోహన్ కాకినాడ జీజీహెచ్ మేనేజర్ నరసింగరావుకు మెమో జారీ చేశారు. అవినీతి జరిగిందనే ప్రాథమిక నిర్ధారణలను ప్రస్తావిస్తూ చోటు చేసుకున్న అవకతవకలను మెమోలో ప్రస్తావించారు. నియామకాల్లో ఇంతటి అవినీతికి పాల్పడితే ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని కోరారు. ఈ విషయంపై కలెక్టర్‌ను వివరణ కోరగా నరసింగరావుపై నర్సింగ్ పోస్టుల విక్రయాల అంశంపై చేపట్టిన విచారణ ఆధారంగా మెమో జారీ చేసినట్లు తెలిపారు. శాంక్షన్ పోస్టుల్లో అవినీతికి పాల్పడ్డాడన్న ఆరోపణలకు సంబంధించి విచారణకు, ప్రస్తుత మెమోకు సంబంధం లేదన్నారు. అతని వివరణ అనంతరం తుది చర్యల కోసం విచారణ అంశాలను రాష్ట్ర స్థాయి సంబంధిత విభాగానికి నివేదిస్తామని తెలిపారు.

వైభవంగా కార్తిక దీపారాధన


కార్తిక దీపారాధన మహోత్సవం ప్రారంభించిన మంత్రి సుభాష్


ఉష్ట్ర వాహనంపై స్వామి నగరోత్సవం ప్రారంభించిన పిల్లి సూర్యప్రకాశ్


అఖండ దీపారాధన ప్రారంభించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


సామూహిక లక్ష తులసి పూజలో పాల్గొన్న భక్తులు

రామచంద్రపురం రూరల్: ఏటా కార్తిక మాసం చివరి మంగళవారం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహించే కార్తిక దీపారాధన మహోత్సవాలు 61వ సంవత్సరం వైభవంగా నిర్వహించారు. ఉదయం జుత్తిక చిన్న బ్రహ్మత్వంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రసన్నాంజనేయ స్వామిని దర్శించుకుని విశేష లక్ష తులసి పూజ ప్రారంభించారు.

మధ్యాహ్నం రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ఉష్ట్ర వాహనంపై స్వామివారి నగరోత్సవాన్ని ప్రారంభించగా గ్రామంలో స్వామివారి నగరోత్సవం కన్నుల పండువగా జరిగింది. ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అఖండ జ్యోతి వెలిగించారు. శుభమ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి ఆహూతులను ఉర్రూతలూగించింది.దవులూరి శ్రీను ఆధ్వర్యంలో కళ్లు మిరుమిట్లు గొలిపే బాణసంచా మందు కాలుపులతో చిన్నారులు కేరింతలు కొట్టారు. అర్ధరాత్రి ప్రదర్శించిన రామాంజనేయ యుద్ధం నాటకం ఆకట్టుకుంది.

నిజాయితీ చాటుకున్న విద్యార్థులు


విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న హెచ్ఎం హరనాథ్

మామిడికుదురు: పెదపట్నంలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థులు తమ నిజాయితీని చాటుకున్నారు. రేకపల్లి బాబీకి చెందిన రూ.1.30 లక్షలు విలువైన బ్రాస్లెట్ ఇటీవల పడిపోయింది. అది అదే గ్రామానికి చెందిన 7వ తరగతి విద్యార్థులు మల్లాడి హర్షశ్రీసాయివినయ్, పొన్నమండ ఆనంద్‌కు దొరికింది. వారు తమకు దొరికిన బ్రాస్లెట్‌ను బాధితుడు బాబీకి అందజేశారు. నిజాయితీగా బ్రాస్లెట్ తీసుకువచ్చి ఇచ్చిన ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.హరనాథ్ ద్వారా అందించారు. ఇద్దరు విద్యార్థులను హెచ్ఎం హరనాథ్‌తో పాటు సర్పంచ్ సుందరనీడి చిన్ని, సాయిబాబా ఆలయ కమిటీ ప్రతినిధి యేడిద రఘు, సలాది దొరబాబు అభినందించారు.

పుణ్యక్షేత్ర పవిత్రతను కాపాడుకోవాలి

శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి


ప్రసంగిస్తున్న భారతీ మహాస్వామి. చిత్రంలో ఎమ్మెల్యే, ఆలయ ఏసీ, రాజా బహద్దూర్

సఖినేటిపల్లి: భగవంతుడు కొలువై ఉన్న అంతర్వేది పుణ్యక్షేత్ర పవిత్రతను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని శృంగేరి పీఠాధిపతి విధు శేఖర భారతీ మహాస్వామి భక్తులకు హితవు పలికారు. మంగళవారం అంతర్వేది క్షేత్రంలో లక్ష్మీనృసింహుని దర్శనానికి విచ్చేసిన భారతీ మహాస్వామికి అర్చకులు, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. లక్ష్మీనృసింహస్వామికి విశేష అర్చన, ఉపాలయంలోని రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులను ఉద్దేశించి భారతీ మహాస్వామి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. దివ్య క్షేత్రంలో భగవంతుడికి సేవ చేసుకోవడం ఎంతో పుణ్యప్రదమైందన్నారు. భగవంతుడి పట్ల శ్రద్ధాభక్తి, విశ్వాసం ఉంచాలన్నారు. భగవత్సంకల్పం ఉంటే ఎంత కష్టమైన పనైనా సులభంగా జరుగుతుందన్నారు. లక్ష్మీనృసింహుని దివ్యానుగ్రహంతో పుణ్యక్షేత్రంలో అభివృద్ధి పనులు దిగ్విజయంగా జరగాలని ఆకాంక్షించారు. సనాతన ధర్మం ఎపుడూ దృఢంగా ఉండాలి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేదిక వద్ద ఏటా నృసింహ జయంతి రోజున స్వామివారి పూజా కార్యక్రమాలు నిమిత్తం శృంగేరి పీఠం తరఫున శాశ్వత విరాళంగా రూ.లక్షా 11 వేల 116 నగదును దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు మహాస్వామి అందజేశారు. వేదిక వద్ద రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాలరాజా బహద్దూర్, మహాస్వామి ఆశీస్సులు అందుకున్నారు. ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ రామలింగేశ్వరరావు, ఏపీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ జీ పెదకాపు, ప్రజాప్రతినిధులు బైరా నాగరాజు, కొండా జాన్‌బాబు, ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహసీల్దారు సీహెచ్ భాస్కర్ పాల్గొన్నారు. తొలుత అంతర్వేది బీచ్‌లో భారతీ మహా స్వామి పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం నీలకంఠేశ్వరస్వామివారి ఆలయంలో స్వామికి ప్రత్యేక అభిషేకం చేశారు. ఆలయంలోని పార్వతీదేవి అమ్మవారిని మహాస్వామి దర్శించుకున్నారు. కాగా స్వామీజీ మంగళవారం సాయంత్రం వానపల్లిలో పర్యటించారు. రాత్రికి రాజమహేంద్రవరం చేరుకున్న ఆయనకు భక్తులు ఘన స్వాగతం పలికారు. శోభాయాత్ర నిర్వహించారు.

ధాన్యం లారీ బోల్తా


దేవరపల్లి మండలం యర్నగూడెం-పలంట్ల రోడ్డులో బోల్తాపడిన ధాన్యం లారీ

దేవరపల్లి: యర్నగూడెం నుంచి పల్లంట్ల వెళ్లే రోడ్డు మంగళవారం ధాన్యం లారీ బోల్తాపడింది. ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ రోడ్డులో ఎక్కువగా వ్యవసాయ భూములు ఉన్నాయి. యర్నగూడెం, ధుమంతునిగూడెం, రామన్నపాలెం, కృష్ణంపాలెం గ్రామాలకు చెందిన రైతులు తమ పొలాల్లో పండిన పంటలను ఇళ్లకు తీసుకురావడానికి ఈ రోడ్డునే వినియోగిస్తారు. అయితే మార్గం సరిగా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. రోడ్డులోని అమ్మవారి ఆలయం వద్ద గల కల్వర్టు పూర్తిగా శిథిలం కావడంతో గొయ్యి ఏర్పడింది. ప్రస్తుతం ధాన్యం రవాణా జరుగుతున్నందున లారీలు, ట్రాక్టర్లు గోతిలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. కృష్ణంపాలెంకు చెందిన రైతు సత్తి సాయి ఈశ్వరరెడ్డికి చెందిన పొలం నుంచి ధాన్యం బస్తాల లోడుతో వస్తున్న లారీ కల్వర్టు వద్ద గోతిలో పడి బోల్తాపడింది. రోడ్డుకు మరమ్మతులు చేసి, కల్వర్టు నిర్మించాలని ఆ ప్రాంత రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రైతులు అప్రమత్తం కావాలి

అమలాపురం రూరల్: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మూలంగా ఈ నెల 29, 30, డిసెంబర్ 1,2, తేదీలలో వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున కోనసీమ వరి రైతులు తమ పంటలను కాపాడుకునేలా అప్రమత్తం కావాలని జాయింట్ కలెక్టర్ టీ. నిశాంతి మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం నిలబడి ఉన్న వరి పంట కోతలు కోయరాదని సూచించారు. కోతలు కోసి పనలు మీద ఉన్న ధాన్యాన్ని ఉప్పు ద్రావణంతో పిచికారీ చేస్తూ మొలకలు రాకుండా, రంగు మారకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఇప్పటికే నూర్చిన ధాన్యాన్ని వెంటనే తమకు నచ్చిన మిల్లులకు తరలించి విక్రయించుకునేలా పౌర సరఫరాల శాఖ పూర్తి సహకారాలు అందిస్తుందన్నారు. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని కూడా మిల్లులకు ట్యాగింగ్ చేస్తామని వెంటనే మిల్లులకు తరలించాలని ఆమె సూచించారు. రైస్ మిల్లుల వద్ద నియమించిన కస్టోడియల్ అధికారులు గోనె సంచులు, హమాలీలు, రవాణా వసతులను కల్పిస్తారన్నారు. జిల్లాస్థాయి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జిల్లా పౌరసరఫరాల మేనేజర్, జిల్లా పౌరసరఫరాల అధికారి అందుబాటులో ఉండి రైతులకు సహాయ సహకారాలు అందిస్తారని పేర్కొన్నారు. అల్లవరం, అమలాపురం, ఐ.పోలవరం మండలంలో వరి సాగు తక్కువగా ఉందని ఆమె స్పష్టం చేశారు.

ఆరుగురు బెల్ట్ షాపుల నిర్వాహకుల బైండోవర్

అమలాపురం రూరల్: అమలాపురం మండలంలో, ఉప్పలగుప్తంలో అనధికారికంగా మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ఆరుగురి వ్యక్తులపై ఎక్సైజ్ అధికారులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. అమలాపురం, ఉప్పలగుప్తం మండల తహసీల్దార్లు కిషోర్‌బాబు, దివాకర్ ఎదుట హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ష్యూరిటీ విధించారని ఎక్సైజ్ సీఐ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. బీఎన్ఎస్ఎస్ యాక్ట్ ప్రకారం ఆరుగురు నిందితులను బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

'1930'కు కాల్ చేసి ఫిర్యాదు చేయండి


సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు సూచించారు. అమలాపురం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి ఆధ్వర్యంలో తమ బ్యాంక్ ఖాతాదారులతో స్థానిక యెండూరి కన్వెన్షన్ హాలులో సైబర్ నేరాలపై మంగళవారం రాత్రి జరిగిన అవగాహన సదస్సులో ఎస్పీ కృష్ణారావు మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరగాళ్లు అందుబాటులోకి వచ్చిన టెక్నాలజీని అడ్డుగా పెట్టుకుని అనేక నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. సైబర్ నేరం జరిగిన తర్వాత రెండు గంటల గోల్డెన్ పీరియడ్‌లోపు సైబర్ విభాగానికి తక్షణమే ఫోన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆ విభాగం అందుబాటులో ఉంచిన '1930' టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని స్పష్టం చేశారు. ఆ తర్వాతే మీకు అందుబాటులో ఉన్న పోలీసు స్టేషన్‌ను లేదా పోలీస్ అధికారికి స్వయంగా కలిసి సైబర్ నేరం జరిగిన తీరు. పోగొట్టుకున్న అమౌంట్ తదితర వివరాలను అందించాలన్నారు. ఏ బ్యాంక్‌లో అకౌంట్ ఉందో ఆ బ్యాంక్ అధికారులకు తక్షణమే సమాచారం అందించాలని సూచించారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ కృష్ణ ఆన్‌లైన్ ద్వారా సైబర్ విభాగానికి ఎలా ఫిర్యాదు చేయాలో వివరించారు. సదస్సులో అమలాపురం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి చీఫ్ మేనేజర్ రమేష్, ఎస్‌బీఐ హెచ్ఆర్ మేనేజర్ మురళీకృష్ణ, పట్టణ సీఐ పి.వీరబాబుతో పాటు బ్యాంక్ ఖాతాదారులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వ్యక్తిపై దాడి చేసి గాయపరచిన కేసులో నేరం నిరూపణ కావడంతో ముద్దాయికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.మూడు వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 5వ ఏజెఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి జి.శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తీర్పుచెప్పారు. 2021వ సంవత్సరం ఫిబ్రవరి 3న నమోదైన ఈ కేసు వివరాలు మూడో పట్టణ పోలీసులు తెలిపారు. మున్సిపల్ కాలనీకి చెందిన తాళ్ల రాజు ఇంట్లో ఉన్న జామ చెట్టు విషయంలో తన పక్కింట్లో ఉంటున్న బూసి శామ్యూల్‌తో వాగ్వాదం అయింది. ఈ నేపథ్యంలో తాళ్ల రాజుపై బూసి శామ్యూల్ దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. గాయపడిన రాజు ఆసుపత్రిలో చేరి చికిత్స పొంది పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి మూడో పట్టణ ఎస్సై కె.ప్రమీల కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీవీమోహన్‌రావు ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. నిందితుడు బూసి శ్యామ్యూల్ పై నేరం ఋజువు కావడంతో జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసు దర్యాప్తులో సాక్షులను సమగ్రంగా ప్రవేశపెట్టి నిందితుడికి శిక్ష పడడంలో ప్రతిభ కనబరిచిన అప్పటి 3 టౌన్ ఎస్సై కె. ప్రమీల ను, దర్యాప్తు పర్యవేక్షించిన ఇన్‌స్పెక్టర్ వి.అప్పారావును, కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఎస్.వెంకటేశ్వరావును జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శంఖవరం: సీతంపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగళవారం వ్యక్తి మృతి చెందాడు. గ్రామంలోని జాతీయ రహదారిని ఆనుకొని ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒడిశాలోని రాయగడ్‌కు చెందిన జన సురేష్ కుమార్ (32) మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డాక్టర్ శ్రీకాంత్‌కు బెయిల్ మంజూరు

అమలాపురం టౌన్: వలంటీర్ హత్య కేసులో నిందితుడిగా ఉన్న డాక్టర్ పినిపే శ్రీకాంత్‌కు మంగళవారం బెయిల్ మంజూరైంది. ప్రస్తుతం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న డాక్టర్ శ్రీకాంత్‌కు అమలాపురం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే డాక్టర్ శ్రీకాంత్ జైలు నుంచి బుధవారం విడుదలవుతారని తెలిసింది.